# నాన్నగారు వచ్చేశారు

-డాక్టర్ జె.భాగ్యలక్ష్మి

"స్కూలు బస్సుకు టైమయింది. ఇక పదమ్మా" అని కూతురిని చేరదీసింది సుష్మ.

"అమ్మా రేపు పేరెంట్సు డే"

"నాకు తెలుసు. నేను వస్తానని చెప్పానుగా"

"మరి నాన్నగారు..."

సుష్మ నోట మాట రానట్టు అలాగే నిలబడిపోయింది.

"నాన్నగారు కూడా వస్తారా అమ్మా" మళ్ళీ అడిగింది పాప.

అప్పుడే అక్కడికి వచ్చిన పద్మజ "అదేంటి పాపా, నాన్నగారెలా వస్తారు? దేవుడి దగ్గరకు వెళ్ళారని తెలుసు కదా" అంది.

తెలుసునని తల ఊపింది పాప. "అక్కడి నుంచి వచ్చేస్తారు కదా" అంది.

సుష్మ, పద్మజ మొహాలు చూసుకొన్నారు.

"వస్తారు. కాని ఒక నెల రోజులు ఆగాలి" అంది పద్మజ నవ్వుతూ.

"పో అత్తా. తమాషా చేస్తున్నావు కదూ. అన్ని రోజులు పట్టదు. నాన్నగారు వచ్చేశారు. నాకు తెలుసు"

"ఇక మాటలు చాలు. పద వెళ్దాం" అంది సుష్మ పాప చెయ్యి పట్టుకొంటూ.

"కాదమ్మా. నిజంగానే నాన్నగారిని చూశాను. నిన్న స్కూలుకు వచ్చారు."

సుష్మ మొహం పాలిపోయింది. తనని తాను సంబాళించుకోలేనట్లు సోఫాలో కూర్చుండి పోయింది.

"పాపా, తప్పమ్మా, అబద్ధాలు చెప్పకూడదు. అమ్మకు కోపం వస్తుంది. ఇదిగో సురేష్. ఏం చేస్తున్నావు ఇలా రా, పాపను బస్సెక్కించిరా" అంది పద్మజ.

"లేదత్తా. అబద్ధాలు కాదు. నిన్న నేను గ్రౌండులో ఆడుకొంటుంటే నాన్నగారు వచ్చారు. ఎత్తుగా, లావుగా ఉన్నారు. 'నువ్వు లావణ్య కదూ. మీ అమ్మ సుష్మ కదూ. నేను మీ నాన్నని' అన్నారు. ఒక చాకొలేటు కూడా తెచ్చారు. 'ఇంట్లో చెప్పవద్దు. రేపు ఇంకా బొమ్మలు తెస్తాను' అన్నారు.

"నువ్వేమన్నావు? కొత్తవాళ్ళతో మాట్లాడకూడదని నీకు తెలుసు కదా" పద్మజ అడిగింది.

"నేను చాకొలేటు తీసుకోలేదు. 'అమ్మ కొట్టుంది' అని పరుగెత్తివెళ్ళిపోయాను అత్తా."

అప్పుడే సురేష్ "ఏంటమ్మా" అంటూ వచ్చాడు.

సుష్మ గభాలున లేచి "పాపా ఈరోజు నీవు స్కూలుకు వెళ్ళటం లేదు. బట్టలు మార్చుకో" అంటూ గదిలోకి తీసుకెళ్ళింది.

"ఎందుకమ్మా" అని పాప అడుగుతూనే ఉంది.

పద్మజకు ఏం పాలుపోలేదు. "వెళ్ళు సురేష్. నీకూ కాలేజికి టైమయింది" అని కొడుక్కు చెప్పి తానూ గదిలోకి వెళ్ళింది. సుష్మ పాపకు వేరే గౌను తొడిగిస్తూ ఉంది కాని కళ్ళ నుండి ధారాపాతంగా నీళ్ళ కారుతూనే ఉన్నాయి.

"సుష్మా అదేం పని ఊరుకో. పాప తెలిసీ తెలీక ఏదో అంటోంది. తర్వాత నెమ్మదిగా తెలుసుకొందాం. నువ్వలా బెంబేలు పడితే ఎలా" అంది పద్మజ.

"కాస్సేపు పాఠాలు చదువుకో. ఆ తర్వాత ఆడుకొందువుగాని" అని కూతురికి చెప్పి సుష్మ వదినతోపాటు ఇవతలికి వచ్చింది.

సుష్మ, పద్మజ చాలాసేపు ఈ విషయమే మాట్లాడుకున్నారు. "మొత్తానికి పాపను చూడటానికి ఎవరో వచ్చారు. వివరాలన్నీ తెలుసుకొనే వచ్చారు. ఏదో మోసం కావచ్చు. రౌడీ కావచ్చు లేక..." సుష్మకు మాటాగిపోయింది. కళ్ళలో భయం స్పష్టంగా కనిపిస్తోంది.

"ఛ ఊరుకో. ఏవేవో ఊహించుకోకు. ఇన్నేండ్ల తర్వాత మళ్ళీ... ఉహు అది సాధ్యం కాదు. మధ్యాహ్నంగా మీ అన్నయ్యను స్కూలుకు వెళ్ళి వివరాలు కనుక్కొమందాం. నువ్వు భయపడకు" అని అనునయించింది పద్మజ. ఆ తర్వాత ఇద్దరూ తమ తమ పనుల్లో, ఆలోచనల్లో ఉండిపోయారు.

ఇంచుమించు ఎనిమిదేండ్ల తర్వాత సుష్మ జీవితం ఓ మార్గాన పడుతోందని మాధవరావు, పద్మజ ఎంతో ఆనందించారు. రమణకు సుష్మ గురించి అన్ని విషయాలూ తెలుసు. పాపంటే కూడా అతనికి చాలా ఇష్టం. మాధవరావు ఆఫీసులోనే అతని ఉద్యోగం. ప్రొబేషనరుగా ఉన్నప్పుడు మాధవరావు వద్దే ట్రైనింగ్ పొందాడు. ఆ తర్వాత అదే ఆఫీసులో ఉద్యోగమయింది. మాధవరావు ఇంటికి రావటం, పోవటం, కొన్ని సందర్భాలలో కలిసి పార్టీలు చేసుకోటం, సినిమాలకు, పిక్నిక్కులకు వెళ్ళటం – ఇంట్లో మనిషిలా మెలిగేవాడు.

ఒకసారి మాటల సందర్భంలో సుష్మ భవిష్యత్తు గురించి తన బాధ వెళ్ళబుచ్చాడు మాధవరావు. అప్పుడు రమణే స్వయంగా అన్నాడు. "సార్ మీకు అభ్యంతరం లేకపోతే సుష్మ బాధ్యతలు నేను తీసుకొంటాను. ఆమె అభిప్రాయం కూడా కనుక్కోండి"

"మరి మీ ఇంట్లో..."

"పర్వాలేదు. వాళ్ళు నేను స్థిరపడితే చాలని అనుకొంటున్నారు. నా తమ్ముడికి, చెల్లెలికి కూడా పెళ్ళిళ్ళయ్యాయి. పెద్ద కొడుకునయి ఉండీ, ముప్పయి ఐదేళ్ళు వస్తున్నా పెళ్ళి చేసుకోలేదని మా అమ్మా నాన్నలకు బాధగానే ఉంది. నా నిర్ణయాన్ని వాళ్ళు కాదనరు"

"నిజమే. కాని సుష్మకు ఒక ఏడేళ్ళ పాప ఉందని తెలిస్తే..."

"అప్పుడూ ఏమనరు. పిల్లలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొనేటట్టే పెంచారు. మామీద మా అమ్మా నాన్నలకు ఎంతో నమ్మకం" అన్నాడు స్థిరంగా.

"సరే ఒకటి రెండు నెలల్లోనే ఇది కానిద్దాం" అన్నాడు మాధవరావు.

"సార్, నాదో రిక్వెస్టు"

"రమణా నీకెన్నిసార్లు చెప్పానయ్యా నన్ను సార్ అని పిలవద్దని."

"అలవాటు సార్. దాని సంగతి మరచిపోండి"

"సరే. ఏమిటి నీ రిక్వెస్టు?"

"మేము సివిల్ మేరేజి చేసుకొంటే బాగుంటుందనుకొంటున్నాను. ఆ తర్వాత కావాలంటే పార్టీ ఏర్పాటు చేసుకోవచ్చు."

"చక్కగా ఆలోచించావు రమణా. వెరీ గుడ్."

"ముందు సుష్మ అభిప్రాయం తెలుసుకొండి. ఆ తర్వాతే ఏదయినా" అన్నాడు రమణ.

"తప్పకుండా" అన్నాడు మాధవరావు.

ఆ రాత్రి సుష్మతో, పద్మజతో చర్చించాడు.

"జీవితమంతా ముందే ఉందమ్మా. ఒకసారి కాలు విరిగిందని ఎవరూ నడవటం మానెయ్యరు. ఎలాగైనా మామూలుగా ఉండాలనే ప్రయత్నిస్తారు. జీవితమూ అంతే" అని సుష్మకు నచ్చజెప్పాడు. సుష్మకూ రమణంటే అభిమానమే. అందువల్ల త్వరగానే ఒక నిర్ణయానికి రాగలిగారు. పెళ్ళికై కోర్టులో దరఖాస్తు పెట్టుకొన్నారు ఒక వారం క్రితమే. వచ్చే నెలలోనే పెళ్ళి.

ఇప్పుడు పాప చెప్పిన మాట ఒకవిధంగా భూకంపాన్నే తెచ్చింది. అంతా అల్లకల్లోలమైనట్టనిపిస్తుంది. "అతడు" ఇన్నేళ్ళ తర్వాత రావటమేమిటి? ఇంత దూరాన ఊరుకాని ఊర్లో వెతుక్కొంటూ ఎలా వచ్చాడు? ఏ ఉద్దేశంతో వచ్చాడు? ఏ అపకారం చేద్దామని వచ్చాడు. అన్నీ ప్రశ్నలే, అన్నీ భయాలే. అసలు "అతడు" అతనో కాదో! ఇంకేదైనా మోసమో! పిల్లల్ని ఎత్తుకుపోయే ముఠానో! లావణ్య దగ్గరికే ఎందుకు వచ్చారు? తలుచుకొంటేనే ఒళ్ళు జలదరిస్తోంది.

పద్మజ ఫోన్ చేసి చెపితే మాధవరావు నమ్మలేకపోయాడు. "నువ్వేమంటున్నావు? వాడు వచ్చాడంటావా? ఎనిమిదేండ్ల తర్వాత వచ్చాడా? చండీగఢ్ దాకా వచ్చాడా?"

"తెలీదు. వెళ్ళి ఒకసారి స్కూలు ప్రిన్సిపల్‌తో మాట్లాడి రాకూడదూ."

"సరే. అలాగే చేస్తాను. సుష్మకు కొంచెం ధైర్యం

## భయం-అభయం

గతం
స్వగతమై
వర్తమానాన్ని
ఆక్రమించినప్పుడు
భవిష్యత్ కలల్లోకి
వెళ్ళలేని కలత
గతం సమాధి అయి
వర్తమాన ఆనందమే విరిసినప్పుడు
భవిష్యత్ అభయమే!
కిటికీ అంచున చంద్రుడు
కెరటాలలో చంద్రుడు
కొబ్బరి ఆకుల మధ్య చంద్రుడు
చంద్రుడ్ని ముక్కలు చేశానన్న తృప్తి!
జీవితంలో కలిశాము ఒకచోట
కలసి నడిచాం ప్రతీ పూట
విడిపోయినది విరహపు తోట
విడిపోయిన చోట నా కన్నీటి ఊట
అయ్యింది నీకు ముత్యాల పేట

-ఎం. వీరేశ్వరరావు

చెప్పు. వాడొచ్చినా మనకేం భయంలేదని చెప్పు. నా ఎదుట బడితే మాత్రం వాడి కాళ్ళూ చేతులూ విరిచెయ్యటం ఖాయం. ప్రాణం తియ్యటానికి కూడా వెనుకాడను."

"సరే సరే. మిమ్మల్ని మీరు కంట్రోల్ చేసుకోవాలి. ప్రిన్సిపాల్‌తో కూడా నెమ్మదిగా మాట్లాడి ఆరా తీయండి. కోపం తెచ్చుకోకండి. మీకు కోపం వచ్చిందంటే ఇక అంతే. మొదటికే మోసం వస్తుంది" అని అనునయించి చెప్పింది భర్తకు.

ఇంట్లో సుష్మ మౌనంగా ఏదో చదువుతున్నట్టు నటిస్తోంది కాని తాను ఏడుస్తూనే ఉంది. తనకు అన్నీ ఉండి ఏమీ లేని దురదృష్టవంతురా లెందు కయింది? ఎడతెగని దుఃఖం, బాధ, అవమానం తననే ఎందుకు వెంటాడాలి? ముక్కూ మొహం తెలియని వాళ్ళయినా తనను 'ఛీ' అనే స్థితికి ఎందుకు చేరింది? దీనికంతటికీ కారణం తాను చేసిన ఒకే ఒక నేరం – ప్రేమలో పడటం. ఆ పడటం, పడటం పర్వత శిఖరం నుండి లోయలోకి పడినట్లే అయింది. కాని రెండు చేతులూ చాపి తనను పదిలంగా పట్టుకొన్నది తన అన్న మాధవరావు. ఆ ప్రక్కనే అనురాగంతో నిలిచిన తన వదిన పద్మజ. మాధవరావుకూ తనకూ పదిహేనేండ్ల తేడా. తనని చెల్లెలిలా కాకుండా కూతుర్లా చూసుకొంటాడు. అమ్మా నాన్నల వద్దలేని చనువు అన్నా వదినల వద్ద ఉంది.

సుష్మ తండ్రి జిల్లా అధికారిగా గొప్ప హోదాలో ఉండేవాడు. ఆయనకు ముగ్గురు సంతానం. కొడుకు మాధవరావు, కూతుర్లు రత్న, సుష్మ. సుష్మ కాలేజి చదువులకు వచ్చేసరికి మాధవరావుకు ఆలిండియా సర్వీసులో ఉద్యోగం, వివాహం అన్నీ అమిరాయి. రత్న వివాహమయి భర్తతో పాటు విదేశాలకు వెళ్ళింది. చిన్న కూతురు సుష్మ ఒకతే ఇంట్లో మిగిలింది. అప్పటికి ఆ అమ్మాయికి పదిహేడేండ్లు నిండాయి. అల్లారు ముద్దుగా పెరిగింది. నవ్వుతూ తుళ్ళుతూ ఉండేది. కాలేజికి వెళ్ళటం, సరదాగా ఫ్రెండ్సుతో కబుర్లు, ఆటలు, సినిమాలు, రొమాంటిక్ నవలలు ఇదీ ఆమె ప్రపంచం. సుష్మకు తిరగటానికి వీలుగా ఒక కారు డ్రైవరుతో పాటు అమిరింది. డ్రైవరు సోంబాబు చురుగ్గా ఉండేవాడు. పొడవుగా అందంగా ఉండేవాడు. చక్కగా పాటలు పాడేవాడు. జోక్స్ వేసేవాడు. సుష్మ ఏం కోరితే ఆ పని ఎంత కష్టమైనా నెరవేర్చేవాడు. పక్కన కూర్చోబెట్టుకొని స్టీరింగ్‌పై చెయ్యి మీద చెయ్యి వేసి డ్రైవింగ్ నేర్పించేవాడు. సుష్మ చిన్న చిన్న రహస్యాలు పెద్దవాళ్ళకు తెలీకుండా కాపాడేవాడు. సహజంగానే వీళ్ళిద్దరికీ దగ్గరి తనం పెరిగింది. అది ప్రేమగా మారింది. సుష్మ ప్రేమ లోకంలో కులాలు, వర్గాలు, ధనికులు, పేదలు అనే భేదాలు లేవు. చదువు, పదవి, పరువు, ప్రతిష్ఠ అనే వాటితో ప్రమేయమే లేదు. వెచ్చగా గువ్వలా ఒదిగిపోవటం, ఒడిలో పడుకొని చెట్టు కొమ్మల మధ్యగా ఆకాశం చూస్తూ కబుర్లు చెప్పుకోటం, మధురమైన పాటలు వింటూ ఆనంద లోకాల్లో తేలిపోవటం వంటి మధురానుభూతులే అక్కడ ఉంటాయి. ప్రేమ ప్రపంచాన్నే ఎంతో అందంగా మార్చేస్తుంది. ఎప్పుడూ చిరునవ్వులే. కళ్ళలో తళుకులే. అన్నీ జోక్సే. ప్రపంచంలో తాను ప్రేమించిన వ్యక్తే నిత్యమూ సత్యమూ. ఇతర విషయాలన్నీ అర్థరహితమే. ఒకరి కళ్ళలో ఒకరు చూసుకొంటూ, ఒకరి సామీప్యాన్ని ఒకరు అనుభవిస్తూ గంటలు గంటలు గడిపెయ్యొచ్చు. ఏ మాటలూ అవసరం లేదు. ఆ సుందర ప్రపంచంలోకి సుష్మ ఒంటరిగా, ధైర్యంగా బయలుదేరింది.

తన భవిష్యత్తు గురించి, జీవితం ఎలా గడుస్తుందనే దానిగురించి, డబ్బు గురించి ఆలోచనలు తనకు అసలు లేవు. కాకపోయినా సోంబాబు తనని అక్కున చేర్చుకొంటూ తనని పువ్వులా చూసుకొంటానని మాటిచ్చాడు. టాక్సీ నడిపి, మూటలు మోసి, బరువులు ఎత్తి ఏవిధంగానైనా తనకు అన్నీ చేకూరుస్తానన్నాడు. బలమైన తన చేతులు చూపిస్తూ తనకున్న సంపద అదేనన్నాడు. ఆ మాటలతో సుష్మ అతనిని లతలా అల్లుకుపోయింది.

సుష్మ కొన్ని నగలూ డబ్బూ పట్టుకొని సోంబాబుతో వెళ్ళిపోయింది. తాను అతనితో గుళ్ళో దండలు మార్చుకొన్నానని, అతనే తన భర్తని దేవుడి వద్ద ప్రమాణం చేశానని, దీనికి ఇంట్లో ఒప్పుకోరని తెలిసి తాను వెళ్ళిపోతున్నానని ఉత్తరం వ్రాసిపెట్టి మరీ వెళ్ళింది.

సుష్మ తండ్రికి కూతురి మీద చెప్పలేనంత కోపం వచ్చింది. గారాబంగా పెంచినందుకు తనని బాగానే శిక్షించిందనుకొన్నాడు. "దాని కర్మ ఎలాగైనా చావనీ" అని అనుకొన్నాడు. ఆ రాత్రే హార్ట్ అటాక్ వచ్చింది.

మరో ఆరు నెలలకు సుష్మ వాళ్ళన్నకు ఉత్తరం వ్రాసింది. సోంబాబు ఎక్కడికి వెళ్ళాడో తెలీదు. ఇంట్లో తినటానికి ఏమీ లేదు. తనకు వంట్లో బాగాలేదు. చచ్చిపోవాలని ఉంది. ఎలా చావాలో తెలియటంలేదు. తన కడుపులో ఒక ప్రాణి పెరుగుతోంది. ఉత్తరం అందుకోగానే ఆగమేఘాల మీద చెల్లెల్ని చేరుకొన్నాడు మాధవరావు. ఒంటి మీద స్పృహ లేకుండా ఒక చాపమీద దుప్పటి పరచుకొని నిస్సహాయంగా, దైన్యంగా పడి ఉన్న చెల్లెల్ని చూసి వలవలా ఏడ్చేశాడు. చిన్నపాపను గుండెకు హత్తుకొన్నట్టు సుష్మను హత్తుకొని ముద్దులాడాడు. "ఈ దౌర్భాగ్యమేమిటమ్మా? ఎందుకు తల్లీ నీకీ బాధలు" అని వాపోయాడు. తనతోపాటు ఊరికి తెచ్చేశాడు. అప్పటి నుండి సుష్మ మాధవరావు, పద్మజల వద్దే ఉండిపోయింది.

ఆ తర్వాత లావణ్య పుట్టింది. ఆ పాప పెంపకం, తన బాధను మరచిపోయి జీవితం మళ్ళీ దారిలో పడటం, తను ప్రైవేటుగా ఎంఏ దాకా చదవటం అంతా యాంత్రికంగా గడచిపోయింది. పాపకు నాలుగేళ్ళు వచ్చి "నాన్నేడీ" అని అడిగినపుడు "లేదమ్మా" అని చెప్పింది. "ఎక్కడికి వెళ్ళాడు" అంటే "దేవుడి దగ్గరకు" అంది.

"మళ్ళీ ఎప్పుడొస్తాడు" అంటే "ఇక రాడు" అని చెప్పింది. వదిన ఆ మాటలన్నీ వింటూనే ఉంది. అప్పుడే సుష్మకు తగిన వ్యక్తిని చూసి పెళ్ళిచేయాలనే నిర్ణయానికి వచ్చింది. అపుడే రమణ తారసపడ్డాడు.

సాయంత్రం మాధవరావు స్కూలు ప్రిన్సిపాల్‌ను కలిసి ఇంటికి వచ్చాడు. పద్మజ వివరాలు అడిగింది. "ప్రిన్సిపాల్‌కు అటువంటి వ్యక్తి వచ్చినట్లు, లావణ్యతో మాట్లాడినట్లు తెలీదు. ముందు ముందు సెక్యూరిటీ కాస్త గట్టిగా పెట్టుకొంటాం. పిల్లల్ని హెచ్చరిస్తాం అని మాటిచ్చింది" అని అన్నాడు.

మూడు రోజులు గడిచాయి. పాపను స్కూలుకు పంపలేదు. "ఇంకో స్కూల్లో చేర్పిస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. కాని అదంత సులభం కాదని తెలుసు. ఇంతా చేసి రమణ సుష్మల పెళ్ళికి అవాంతరము రాదు కదా అనే భయమూ ఉంది. ఎప్పుడో గతంలోని వ్యక్తి, ఇక లేడనే అనుకొంటున్న వ్యక్తి హఠాత్తుగా ముందుకు వచ్చి "ఈమె నా భార్య. ఈ బిడ్డ నా బిడ్డ" అని అల్లరిపెడితే రమణయినా దీన్నెలా స్వీకరిస్తాడు? అతని భావమప్పుడెలా ఉంటుంది? అన్నీ పక్కకు పెట్టి సుష్మను పెళ్ళిచేసుకోగలడా? ఇంతకూ ఆ వచ్చిన వాడితో ఎలా వ్యవహరించాలి? వాడినెలా ఎదుర్కోవాలి? ఇవే ఆ ఇంట్లో వాళ్ళ ఆలోచనలు, తర్జన భర్జనలు. అస్పష్టంగా ఉన్న ఆ నీడ ఏమిటో తెలియటంలేదు. అది తమకు ఏ ప్రమాదాన్ని తెస్తుందో అనే భయం పోవటం లేదు.

ఆ సాయంత్రం రమణ వీళ్ళింటికి వచ్చాడు. టీలు, ఫలహారాలు అయ్యాయి. తను పాపతో కంప్యూటర్ గేమ్సు ఆడటానికి కూర్చున్నాడు. ఈ విషయం ఎలా కదపాలా అని పెద్దవాళ్ళు తమలో తామే మథనపడుతున్నారు.

"నేను స్కూలుకెళ్ళలేదు అంకుల్" అని చెప్పింది పాప.

"ఎందుకమ్మా?" అని అనునయించి అడిగాడు రమణ.

"మరేమో ఆ రోజు ఆడుకొంటుంటే నాన్నగారు..."

"లావణ్యా" హెచ్చరించింది సుష్మ. తనకు కోపం వస్తే పాపను పేరు పెట్టి పిలుస్తుంది.

రమణ సుష్మను చూసి పర్వాలేదన్నట్టు నవ్వుతచూ "నువ్వు చెప్పమ్మా" అని పాపను అడిగాడు.

"దేవుడి దగ్గరకు పోయాడు" అంది పాప.

"ఎవరు?"

"నాన్నగారు. ఇక రారు. కాని వచ్చారు"

రమణ నవ్వి పాప తల నిమిరాడు. పాపను రమణ ఒడిలో నుండి తీసుకుపోవటానికా అన్నట్టు పద్మజ ముందుకు వచ్చింది.

"వెళ్ళమ్మా పాపా, సురేష్ టెలివిజన్ చూస్తున్నట్టున్నాడు. కార్టూన్లు చూపించమని అడుగు" అని రమణే పాపని లోపలికి పంపించాడు.

అందరి మొహాల్లో కాస్త టెన్షన్ తగ్గింది. రమణ హాయిగా నవ్వేస్తూ "ఈ రోజు మీరందరూ పాప మీద పడ్డారేమిటి? తనని స్కూలెందుకు మానిపించారు?" అని అడిగాడు.

"ఏం చెప్పాలి రమణా" అని నిట్టూర్చాడు మాధవరావు.

"పాప స్కూలుకు ఎవడో వచ్చి, చాకొలేటు ఇచ్చాడట. 'నేను మీ నాన్నను..' అన్నాడట. మళ్ళీ వచ్చి బొమ్మలిస్తానన్నాడట. వీడెవడు, ఎందుకు వచ్చాడు, పాపనే ఎందుకు పలకరించాడు... ఇవన్నీ తెల్చుకుంటే గాని పాపను పంపలేము కదా!"

"నేను అతని విషయం తేల్చుకొన్నాను లెండి. అది చెబుదామనే వచ్చాను" అన్నాడు రమణ.

అందరూ ఆశ్చర్యపోయారు.

"ఏం తేల్చుకున్నారు, ఎవరి గురించి, మీరేం మాట్లాడుతున్నారు" అని గాభరాగా అడిగింది పద్మజ.

"అక్కా మీరేమీ హైరానా పడవద్దు. అన్నీ వివరంగా చెపుతాను. మొన్న ఒకాయన నన్ను వెతుక్కుంటూ ఇంటికి వచ్చాడు. తనని సుష్మ భర్తగా పరిచయం చేసుకొన్నాడు. అతని గురించి ఇదివరకే విన్నాను గనుక నేనూ కఠినంగానే వ్యవహరించాను. సుష్మతో నా పెళ్ళి జరిగితే కోర్టుకు వెళ్తానన్నాడు. వెళ్ళమన్నాను. అలాంటి కేసులు నాకు చాలా తెలుసన్నాను. అసలు తాను సుష్మ భర్తనని ఏ మొహంతో చెపుతాడని అడిగాను. రుజువు చేయగలవా, పెళ్ళి జరిగిందా, సాక్షులున్నారా అని అడిగాను. ఈ ఎనిమిదేళ్ళు ఏమయ్యావని అడిగాను. ఒక అమాయకపు పిల్లను,

మైనారిటీ తీరకముందే పట్టుకుపోయి నగా నట్రా కాజేసిన నేరానికి శిక్ష పడుతుందన్నాను. ఈ క్షణమే జైల్లో తోయించగలనన్నాను.

"పదిమందితో నేను జరిగింది చెపితే మీ పరువేమవుతుందో ఆలోచించండి" అన్నాడు.

"మా పరువుకేం బాగానే ఉంటుంది. పెళ్ళిళ్ళు, విడాకులు, మళ్ళీ పెళ్ళిళ్ళు ఎవరూ పట్టించుకోరు. ముఖ్యంగా పంజాబులో అవి వింత విషయాలు కావు" అన్నాను.

"మీకేమనిపించదా? ఒక పిల్ల తల్లిని పెళ్ళి చేసుకోటానికి అందులో ఎవరితోనో లేచిపోయిన అమ్మాయిని, శీలం లేని పిల్లని" అని అడిగాడు.

"నీ అంత క్షుద్రంగా ఎవరూ ఆలోచించరు. అసలు శీలమనేది నీకు లేదు నమ్మకద్రోహీ" అన్నాను.

"అబ్బో మీరు గొప్ప సమాజ సేవకుల్లా ఉన్నారే! మీది సంఘ సంస్కరణా లేక స్త్రీ జనోద్ధరణా?" అని వ్యంగ్యంగా అడిగాడు.

అంతే వాడి చెంపలు ఫెడీ ఫెడీ మని వాచి పోయాయి.

"మనుషుల విలువలు తెలిసిన వాళ్ళెవ్వరూ ఇలా ఆలోచించరు. సమాజ సేవలు, సంస్కరణలు చేస్తున్నామనుకొంటూ చేసే పనులకు అర్థం లేదు. అవి ప్రచారానికి పనికివస్తాయి అంతే. ఏదైనా అతి సహజంగా జరిగినపుడే సొగసుగా ఉంటాయి. వాటికి పెద్ద పెద్ద పేర్లుండవు. ఇవన్నీ నీకర్థం కావులే. అసలు నువ్వెందుకొచ్చావు. వీళ్ళను, వాళ్ళను బెదిరించి డబ్బు చేసుకొందామని వచ్చావు. ఇది నీ వాలకమే చెపుతోంది. కాని సుష్మ, పాపల ఛాయలకైనా నీవు వెళ్ళావంటే నీకు జైలుశిక్ష తప్పదు. గుర్తుంచుకో" అన్నాను.

"ఇంత పెద్ద ఆఫీసరయి ఉండీ..." అని గొణిగాడు.

"అందుకే మాటలతో హెచ్చరిస్తున్నా. రేపు చేతల్లో చూపిస్తాను. నీవొక క్రిమినల్. నీ నేరానికి శిక్ష పడాల్సిందే."

"ఎందుకులెండి. రేపు ఉదయమే వెళ్ళిపోతున్నాను' అని వెళ్ళిపోయాడు. మళ్ళీ మనకు అతను కనిపిస్తాడని అనుకోను. మనమనుకొన్న పనులన్నీ సవ్యంగా జరుగుతాయి. సుష్మ, పాప నా దగ్గరికి వచ్చేస్తారు. ఇంకెంత ఇరవై రోజులేకదా" అంటూ రమణ పైకి లేచాడు.

"అదేమిటి భోం చెయ్యకుండా వెళ్తావా" అన్నాడు మాధవరావు రమణను ఎంతో ఆప్యాయంగా చూస్తూ.

అతనిని తన కళ్ళలోనే నింపుకొన్న సుష్మ కళ్ళార్పటం కూడా మరచిపోయింది..

"నాన్నగారూ" అంటూ లోపలి నుండి పరుగెత్తుకు వచ్చింది పాప. ఆ పిలుపుకు ఆశ్చర్యపోతూ పాపను ఎత్తుకొన్నాడు రమణ.

"అత్త చెప్పింది. మీరేనట నాన్నగారు. అమ్మా, నాన్నగారు వచ్చేశారు. ఇన్నాళ్ళూ ఎందుకు చెప్పలేదు. తమాషా చేశారు కదూ!"

"అవునమ్మా" అంటూ పాపను గుండెలకు హత్తుకొన్నాడు రమణ. దీపావళి హడావుడి ప్రారంభమైన సూచనగా టపాకాయలు మోగుతున్నాయి. మతాబాలు వెలుగుతున్నాయి. ■

# రాయడమంటే మాటలు కాదు

రాయడమంటే మాటలుకాదు
నువ్వైనా నేనైనా
మరెవ్వరైనా
కవిత్వం రాయడమంటే మాటలు కాదు.

నిత్యమూ జ్వలించాలంటే
కనపడని నిప్పేదో లోపల దాగి వుండాలి!
నివురు దరిచేరకుండా
నిరంతరం ఎరుకతో మసలాలి.

పిట్ట నాలుగు పురుగుల్ని ఏరి
నోట కరచుకుని వచ్చి
ఆకలిగొన్న పిల్లల నోటికి అందించినట్టు
తల్లికోడి
కాళ్లతో మట్టిని అటూ ఇటూ కెలికి
ఇంత మేత కంటపడగానే
కొక్కొ కొక్కొక్కొ అని
పిల్లలను చేరబిలిచినట్టు
ఈనిన కుక్క
ఆ యిల్లూ ఈ యిల్లూ జొరబడి
దొరికినకాడ ఇంత కతికి
తిరిగి పిల్లల ముందు
ప్రేమతో కక్కినట్టు
కవి అక్షరానికి
తన రక్తమాంసాలు కొంత యివ్వాలి
తన ప్రాణ వాయువును మరికొంత ఊదాలి
అప్పుడే
పొద్దు గుంకగానే
దీపం ముట్టించినట్టు
అక్షరం వెలుగుతుంది.

ఎవరన్నారు
అతను వుత్త ఉదయపు నడకకు బయలుదేరాడని
అతనికంటె ముందు
అక్షరం అదృశ్య అశ్వమై
గుమ్మం ముందు నిరీక్షిస్తుంటుంది
దానిని అధిరోహించి
అతను మనో వీధిని విహరిస్తాడు
అది కొన్నిసార్లు
పచ్చిక బయళ్ల మధ్య
హొయలు హొయలుగా నడుస్తుంది.

మరికొన్నిసార్లు
శత్రుసేనలను మార్కొనడానికన్నట్టు
వాయువేగంతో దౌడు తీస్తుంది.
అతను పిలిస్తే
మనిషి పలికినట్టు పదాలు పలుకుతాయి.
అతను కనుసైగ చేస్తే
కనికట్టు చేసినట్టు
మాటలు మౌనంగా వచ్చి కూచుంటాయి.

అతని పదబంధాలను చూసి
అంత మెత్తగా లేనందుకు
మైనపు ముద్ద మనసు చిన్నబుచ్చుకుంటుంది
బహుశా అతని పూర్వీకులెవరో
పరసువేది విద్యలో ప్రవీణులై వుండి వుంటారు.

నడక ముగిసిన చోటునుండి
పద్యం పరుగు ప్రారంభిస్తుంది.
తలంటు పోసిన శిశువు
ఇంత సాంబ్రాణి పొగ సోకగానే పారవశ్యంతో
తక్షణమే నిదురపోయినట్టు
ధవళవస్త్రం లాంటి మనోపటం మీద
పద్య శిశువు ఆకృతి దాలుస్తుంది.
అజరామరమైన కవిత్వంతో
అతను ఇవాళ జరను జయించాడు
రేపు మరణాన్నీ జయిస్తాడు.

(నిరంతర కవి డా॥ సి.నారాయణరెడ్డిగారికి 75వ పుట్టినరోజు కానుక)

–శిఖామణి